

క్లుప్తంగా

నియామకం


శ్రీపతి సుమన్

నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ నారక్కపేట నూతన అధ్యక్షుడిగా శ్రీపతి సుమన్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ శనివారం ప్రకటనలో తెలిపారు. నారక్కపేట వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోగుల కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా అడుప రాజు, మురహరి కిరణ్, గజ్జి బాబు, ప్రధాన కార్యదర్శులుగా వక్కల యోగేష్, దండెం రాజేష్, సహాయ కార్యదర్శులుగా శ్రీపతి కుమారస్వామి, బూడిమే రమేష్, కోశాధికారిగా వడ్లూరి నాగబాబు, గౌరవ సలహాదారులుగా మెరుగు మల్లయ్య, వైద్యుల రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మెరుగు శివ, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కెత్తే రాజేందర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా అడిచెర్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మామిడి కృష్ణను నియమించినట్లు పేర్కొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నల్లబెల్లి : ఈ నెల 26, 27, 28వ తేదీల్లో హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌ షో కార్యక్రమంలో ఫొటోగ్రాపర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి, మండల గౌరవ అధ్యక్షుడు పడాల మురళి కోరారు. మండల కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్ షో వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు గోరంటాల వెంకట్, కార్యదర్శి పెండ్యాల రాజు, తాడెం సురేష్, కొత్తపల్లి జీవన్, కడియాల విజయ్, కూచన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలను విజయవంతం చేయాలి

గీసుకొండ : వచ్చేనెల 1, 2వ తేదీల్లో హైదరాబాద్ ఓంకార్ భవన్‌లో నిర్వహించే అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జాతీయ జనరల్ బాడీ సమావేశాలను విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గూడ సాయిరాం పిలుపునిచ్చారు. శనివారం గీసుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వ మౌనం వీడాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మహేష్, రాజు, వంశీ, అజయ్, ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

చెన్నారావుపేట : గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 317 జీఓ వల్ల అన్యాయం జరిగిందని తెలంగాణ ప్రభుత్వం న్యాయం చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు.ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్య కోసం ప్రభుత్వం సబ్ కమిటీ వేసిందని, కాలయాపన చేయకుండా వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కిరాణా షాపులో చోరీ

చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం జీపీ ఎదురుగా ఉన్న పటాన్ నాగులుకు చెందిన కిరాణా షాపులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు వెనకాల ఉన్న రేకులను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. షాపులోని రూ.10 వేల నగదు, రూ.10 విలువ చేసే వస్తువులను అపహరించుకుపోయినట్లు బాధితుడు నాగులు శనివారం తెలిపాడు. ఈ మేరకు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

50 లీటర్ల గుడుంబా స్వాధీనం



దుగ్గొండి : మండల కేంద్రంలోని లక్ష్మీపురం క్రాస్‌రోడ్డులో శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. అయితే అనుమానం వచ్చిన పోలీసులు ప్రశ్నిస్తుండగా నిందితుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో వెంబడించి నిందితుడిని పట్టుకుని విచారించారు. నిందితుడు నల్లబెల్లి మండల రేలకుంట తండాకు చెందిన గుగులోత్ రాజు అని 50 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను వరంగల్ కాశిబుగ్గకు తరలించడానికి తీసుకెళ్తున్నట్లు తేలిందని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడి నుంచి 50 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని గుగులోత్ రాజును అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. నిషేధిత గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు, గుడుంబాను విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బోనాల సంబురాలు

రాయపర్తి : మండల కేంద్రంలోని లహరి పబ్లిక్ స్కూల్‌లో శనివారం బోనాల సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేక వేషధారణ చేయించి విద్యార్థుల్లో చైతన్యం నింపినట్లు కరస్పాండెంట్ టి రవిచందర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మరో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు: వాతావరణ శాఖ హెచ్చరిక


దుగ్గొండి: ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్సై


పర్వతగిరి: మాట్లాడుతున్న ఎంపీఓ, ఎంపీడీఓ


దుగ్గొండి : మరో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరద వల్ల ఇబ్బందులు తలెత్తే ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని దగ్గరలోని ప్రభుత్వ భవనాలు, రైతు వేదికలు, పాఠశాలలోకి వెళ్లాలని ఆయన తెలిపారు. ఏలాంటి సమస్యలు ఉన్న పోలీసులకు గాని సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే తగిన సహాయక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

నల్లబెల్లి : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై ప్రశాంత్ బాబు సూచించారు. ఈ మేరకు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదన్నారు. కల్వర్టుల వద్ద వరద పొంగిపొర్లుతున్న సమయంలో కాల్వలు దాటే సాహసం చేయకూడదన్నారు. అత్యవసర సమయాల్లో డయల్-100కు ఫోన్ చేసి సహాయాన్ని పొందాలని సూచించారు.

జీపీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

పర్వతగిరి : భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండల సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పిచ్చిమొక్కలు తొలగించి, నీటి గుంతలను గుర్తించి వాటిని పూడ్చే విధంగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. గ్రామంలో పైపులైన్ లీకేజీలను గుర్తించి, పారిశుద్ధ్య పనులు ఎక్కడ కూడా మురికి నీరు నిల్వ లేకుండా చూసి మురికి కాల్వల వెంట పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ కవర్లు లేకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు పనులు చేయించాలన్నారు. వాటర్ ట్యాంకుల పరిసరాలు శుభ్రం చేయించాలని, గ్రామంలో ఉన్న ఆశ కార్యకర్తలతో జ్వర పీడిత వారి పేర్లు తీసుకుని ఏరియా సందర్శించి అక్కడ పారిశుద్ధ్య పనులు గుర్తించి శుభ్రం చేయించాలని వివరించారు. గ్రామ పంచాయతీలో అందుబాటులో బ్లీచింగ్ పౌడర్ ఉండేలా చూసుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా ఈగలు, దోమలు బెడద ఎక్కువగా ఉంటుందని, వాటిని నివారించే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు


ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న కలాం ఫౌండేషన్ బాధ్యులు


చెన్నారావుపేట : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన కలాం ఫౌండేషన్ బాధ్యులు శనివారం గ్రామంలో సందర్శించి సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ బాషమియా, పిరికి మధుకర్ మాట్లాడారు. ఎలాంటి ప్లాన్ లేకుండా సంబంధిత కాంట్రాక్టర్ సీసీ రోడ్లు నిర్మించాడని ఆరోపించారు. సైడ్ డ్రెయినేజీ నిర్మించిన తర్వాతనే సీసీ రోడ్లు పోయాల్సి ఉంది. కానీ సీసీ రోడ్లు నిర్మించి డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు బయటికి వెళ్లకుండా ఇళ్లలోకి చేరుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోగుల అశోక్, ఊడుగుల రాజు, కుక్కల రాజు, సతీస్, గుళ్లపల్లి మధు, గుడిగంటి అనిల్, రాజు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్పన

ఖానాపురం : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కొత్తూరు వైద్యురాలు కల్పన సూచించారు. ఈ మేరకు కొత్తూరు సబ్‌సెంటర్ పరిధిలోని రాగంపేటలో శనివారం గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రజిత, ఆశ కార్యకర్త తడుగుల సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌పీ సేవలు ప్రారంభం


ఐఎఫ్‌పీ సేవలను ప్రారంభిస్తున్న రవీందర్

నెక్కొండ : డిజిటల్ డివైసెస్ ద్వారా విద్యా బోధన విద్యార్థులకు అర్థవంతగా, సులభతరంగా ఉంటుందని హెడ్‌మాస్టర్ రవీందర్ అన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో శనివారం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డివైజెస్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు పనులు పూర్తికాగా, ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో గతేడాది హైస్కూళ్లకు ఐఎఫ్‌పీలను సమకూర్చిందన్నారు. తమ పాఠశాలకు కూడా రూ.10.35 లక్షల వ్యయంతో పంపిణీ చేసిందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో కిటికీలు అమర్చలేకపోవడంతో ఆలస్యంగా పనులు పూర్తి చేసిన ఐఎఫ్‌పీ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని ఆయన చెప్పారు. దీంతో 8వ తరగతి నుంచి 10 వ తరగతుల విద్యార్థులకు అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉపాధ్యాయులు బోధన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్, గీత, యాదయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, రమేష్‌లతో పాటు గ్రామస్తులు సురేష్, వెంకటేశ్వర్లు, భవాని, యాకయ్య, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంద పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో శనివారం మాదిరి ఎన్నికలను (మాక్ పోలింగ్) నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు పోటీలో నిలవగా పదో తరగతికి చెందిన సాత్విక్ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థి సాత్విక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని చెప్పారు. ఈ ఎన్నికను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయులు కృష్ణ, సర్వన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

సంగెం : టీజీపీఎస్సీ నిరుద్యోగుల సమస్యలపై హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరుద్యోగ మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ, బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం తెల్లవారుజామునే బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భూక్య వెంకన్న, బీజేవైఎం మండల అధ్యక్షుడు అవనిగంటి సతీష్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలల పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నల్లబెల్లి : అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేదని బీజేవైఎం మండల అధ్యక్షుడు సుదగాని ప్రమోద్ గౌడ్ హెచ్చరించారు. బీజేవైఎం రాష్ట్ర ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్‌లో చేపట్టనున్న మహాధర్నాకు తరలి వెళ్లేందుకు యత్నిస్తుండగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్, యువ మోర్చా మండల కార్యదర్శి లోకేష్‌తో పాటు తదితరులను పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగేవరకు పోరాడుతామన్నారు.

విద్యార్థుల నైపుణ్య ప్రదర్శన



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఎదుట వారి ప్రగతిని వివరించారు. చార్టుల ద్వారా వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం హెచ్‌ఎం రామస్వామి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంట్లో చదువుకోవడానికి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు ఇంటి వద్ద చదువుతున్నారా లేదా అని నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేయాలి'

గీసుకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్షలోపు రైతు రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని 16వ డివిజన్ కార్పొరేటర్ సుంకరి మనిషాకుమార్ శనివారం ప్రకటనలో కోరారు. పట్టదారు పాసుపుస్తకం ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పుసక్తం ఋణం పొందిన తేదీతో ఉన్న జిరాక్స్ ప్రతులను ఫిర్యాదు పత్రానికి జతచేయాలని కోరారు.

బెల్ట్ షాపులకు మద్యం తరలింపు



పర్వతగిరి : మండల కేంద్రంలోని పలు వైన్ షాపుల యజమానులు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు ఆటోల్లో మద్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అయితే మద్యం షాపు యజమానులు బెల్ట్ షాపుల వారికి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఇవ్వడంతో బెల్ట్ షాపుల వారు మరింత ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబుల జేబులకు తూట్లు పడుతున్నాయి. ఇదంతా ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

నర్సంపేట రూరల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్, పర్యావరణ వేత్త, కజాంపురం దామోదర్ సూచించారు. ఈ మేరకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో నర్సంపేట మండలంలోని గురిజాల జెడ్పీఎస్ఎస్‌లో శనివారం నిర్వహించారు. ప్రధాన వక్తగా దామోదర్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు సన్మార్గంలో నడుచుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.జీవన నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోని చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు గుడిపూడి రాంచందర్‌రావు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగేందర్, చెన్నారావుపేట ఎస్‌సీడబ్ల్యూఏ అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

నర్సంపేట రూరల్ : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిళి, ఎన్ఆర్ఐ విభాగం రాష్ట్ర ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు జినుకల కొమ్మాలు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజేశ్‌కు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 15 ప్రకారం ముదిరాజ్, ముత్తరాశి, తెనుగోళ్లను బీసీ -డీ నుంచి బీసీ-ఏలోకి పునరుద్ధరణ చేయాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని కోరారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలన్నారు. మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, అమర్‌చందర్, నూనె నర్సయ్య, పల్లె రమేష్, విజయరామరాజు, వేణుచంద్, రవి, స్వామి, వెంకన్న, కటయట్య, రవి, రాజు, నర్సయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం


సంగెం: నగదు అందజేస్తున్న గ్రామస్తులు


రాయపర్తి: వెంకటేశ్వరపల్లిలో..

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఓరుగంటి సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. అనంతరం గ్రామస్తులతో క్వింటా బియ్యంతో పాటు ఆర్థికసాయం పంపించారు. బిల్లా వెంకట్‌రెడ్డి, గబ్బెట బాబు, చిర్ర దర్గయ్య, లింగాల శ్రీనివాస్, గాడిపెల్లి వెంకటయ్య, సుధాకర్, సురేందర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మైలారం గ్రామస్తుడు చిర్ర వేణు 25కేజీల బియ్యం, నూనె అందజేశారు. కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు ఐరెడ్డి ఎల్లారెడ్డి, దురిశెట్టి రాజు, సంది మహేందర్‌రెడ్డి, బొమ్మినేని గౌతమ్‌రెడ్డి, చిర్ర వినయ్, గుంజాల శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపల్లి యూత్ సభ్యుల చేయూత

రాయపర్తి మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్న చిన్నపాక యాకయ్య మనువడు ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి వెంకటేశ్వరపల్లి యూత్ అసోసియేషన్ సభ్యులు శనివారం పరామర్శించారు. అనంతరం రూ.13వేలు ఆర్థికసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి(వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లికి చెందిన దొనికెల రమేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా రమేశ్ మృతదేహంపై పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.4వేలు ఆర్థికసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్దమనిషి యాదగిరి, రాజేంద్రప్రసాద్, కారోబార్ బాబు, వెంకన్న, కుమారస్వామి, రమేష్, బచ్చయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

సంగెం : మండలంలోని మొండ్రాయికి చెందిన ఏడాకుల లింగమూర్తి ఇటీవల మృతి చెందాడు. గ్రామంలోని వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.11,900 నగదును లింగమూర్తి కుమారులకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడుదూరి సంపత్, నాయకులు అనుముల కుమారస్వామి, పెండ్లి పురుషోత్తం, కక్కెర్ల వీరస్వామి, సదయ్య, యార రాములు, పోలబోయిన భద్రయ్య, కడుదూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం


నర్సంపేట: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


చెన్నారావుపేట: అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్ సరోజన

నర్సంపేట : అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో 35మంది పూర్వ ప్రాథమిక విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి యూనిఫాం కూడా అందజేస్తారని, ఒక పూట భోజనం, గుడ్లు, స్నాక్స్‌తో పాటు ఆట పాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఈ ఏడాది ఒకటితరగతిలో 15మంది పిల్లలను జాయిన్ చేయడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవీందర్, క్యాతం తేజశ్రీ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎండి.గౌసియా, ఆయా సునీత, తల్లులు హరిత, లక్ష్మి, శ్వేత, నూరున్, అనీసా, కౌసర్, పిల్లలు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ఈర్య తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ మేడి సరోజన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైనందున చిన్నారులకు అక్షరాలు నేర్పించడం కోసం ప్రారంభంలో అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పవనకుమారి, ఆరాధన, ఏఎన్‌ఎం పుష్ప, ఆశ కార్యకర్త సుశీల, తల్లులు, పిల్లలు ఉన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి


నర్సంపేట రూరల్ : ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఖానాపురంలో..

నర్సంపేట రూరల్ : ప్రతి ఉపాధ్యాయుడికి బదిలీ తప్పనిసరి అని ఇటుకాలపల్లి, రాజుపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, మంగ్య తెలిపారు. ఈ మేరకు నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు గార్లగడ్డ తండాకు చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ధరావత్ వీరన్న బదిలీపై వెళ్లగా అతనిని శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ధరావత్ రవి, రాధా, సాంబయ్య, ఏపీసీ చైర్మన్ కమల, కోమల, విద్యా కమిటీ మాజీ చైర్మన్ భద్రు, మాజీ ఎంపీటీసీ వీరన్న, యూత్ ప్రెసిడెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శి సాయి, అంగన్‌వాడీ టీచర్, ఆయా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వాగ్య, రమేష్, సాంబయ్య బదిలీ కాగా హెచ్‌ఎంలు ఆరిఫ్ హుస్సేన్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అరుణ, వీరన్న, భిక్షపతి, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి

నర్సంపేట : ఆర్టీసీ ప్రభుత్వ విలీనం అపాయింట్‌మెంట్ తేదీని ఈనెల 23నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి యావత్ టీజీఎస్ ఆర్టీసీ కార్మికులకు కానుకగా అందించాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీ-స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) నర్సంపేట డిపో నాయకుడు గొలనకొండ వేణు కోరారు. ఈ మేరకు పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కోరుకున్నారని తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వ విలీనం అపాయింటెడ్ డేట్ కోసం యావత్ తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ప్రతి రోజు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటారని ఆయన అన్నారు.